జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 22 | మే | 2026 ◆ పేజీలు : 8

## జనగణన హౌస్ లిస్టింగ్‌లో ఖచ్చితత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలి

- డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోలీకేర్




**కొత్తగూడెం కలెక్టరేట్, మే 21 ,(ప్రజాజ్యోతి)** జనగణన కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న హౌస్ లిస్టింగ్ బ్లాక్ (హెచ్ఎల్‌బి) ప్రక్రియలో నమోదవుతున్న పొరపాట్లు, వాటి సవరణ విధానం, ఫీల్డ్ స్థాయిలో అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మిగతా 2 లో...




- లక్షల దందాతో ఉద్యోగాల జోరు
- మధ్యవర్తుల వలయంలో మెడికల్ బోర్డు..?
- సింగరేణి మెడికల్ బోర్డు వ్యవహారంపై తీవ్ర విమర్శలు
- రూ.6 నుంచి రూ.8 లక్షల వరకు వసూళ్ల ఆరోపణలు.. విజిలెన్స్ మౌనంపై కార్మికుల్లో ఆగ్రహం
- వారసత్వ ఉద్యోగాలకే ప్రాధాన్యం..?
- సాధారణ నిరుద్యోగులకు అందని సింగరేణి ఉద్యోగాలు

## సింగరేణిలో.... మెడికల్ మాయాజాలం..?

సింగరేణి సంస్థలో 2025–26 సంవత్సరానికి సంబంధించిన మెడికల్ బోర్డు వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఎప్పుడూ లేనంత క్లిష్ట పరిస్థితులు ఈసారి నెలకొన్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదట మెడికల్ బోర్డు నిర్వహణపై చేతులెత్తేసిన సింగరేణి యాజమాన్యాన్ని కార్మిక సంఘాలు ఒత్తిడి చేసి బోర్డు నిర్వహించేలా చేసినప్పటికీ అసలైన అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు మాత్రం న్యాయం జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి..

3 లో..

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## ఉపాధి హామీ పనుల్లో కార్మికుల సంఖ్య పెంచాలి



- పనిస్థలాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం, మే 21 (ప్రజాజ్యోతి )**లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న ఏఎంఐ ట్యాంక్ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం పరిశీలించారు. గ్రామ శివారులో జరుగుతున్న పనుల వద్దకు వెళ్లిన కలెక్టర్ అక్కడ పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడి వేతనాలు సకాలంలో అందుతున్నాయా పనుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో పనిస్థలాల్లో తాగునీరు, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స పెట్టెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పని సమయంలో కార్మికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారి ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యాక్టివ్ జాబ్ కార్డుల వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గ్రామంలో మొత్తం 300 జాబ్ కార్డులు ఉండగా ప్రస్తుతం 146 మంది మాత్రమే

మిగతా 2 లో...

## 27 మంది మావోయిస్టుల లొంగుబాటు

- లొంగిపోయిన మావోయిస్టులపై 33 లక్షల రివార్డు
- భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం



**చర్ల , మే 21: (ప్రజా జ్యోతి ):** జార్ఖండ్ రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాల నిర్మూలన దిశగా భద్రతా బలగాలు కీలక విజయాన్ని నమోదు చేశాయి. రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద సామూహిక లొంగుబాటుగా నిలిచే విధంగా గురువారం ఒకేసారి 27 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలోని సరాండా, కోల్హాన్ ప్రాంతాల్లో చురుగ్గా పనిచేస్తున్న 25 మంది సీపీఐ (మావోయిస్టు) సభ్యులతో పాటు

మిగతా 2 లో...

- మిగులు సోలార్ విద్యుత్ కు విలువ తెచ్చిన సింగరేణి
- మిగులు సోలార్ విద్యుత్ ను నిల్వ చేస్తున్న బీఈఎస్ఎస్
- రాష్ట్ర ప్రభుత్వ ఆదేశంతో రాష్ట్రంలోనే తొలి అతిపెద్ద ప్రాజెక్టు సింగరేణిలో ఏర్పాటు
- నాలుగు నెలల్లోనే సత్ఫలితాలు
- బీఈఎస్ఎస్ తో రూ.26 లక్షల ఆదా




4 లో..

## సోలార్ ఎనర్జీ నిల్వ... సింగరేణికి సిరులు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోనే తొలిసారిగా సింగరేణిలో ఏర్పాటు చేసిన బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ సత్ఫలితాన్ని ఇస్తుంది. పగటిపూట ఉత్పత్తి జరిగే సోలార్ విద్యుత్తులో వినియోగించబడని విద్యుత్తును ఉచితంగా గ్రిడ్ కు సరఫరా చేయకుండా, బ్యాటరీలో నిలువ చేసుకొని, అవసరమైనప్పుడు వాడుకునే అవకాశం కలిగించే ఈ వ్యవస్థ సింగరేణికి ఆర్థిక లబ్ధి చేకూర్చుతుంది.

- ఇల్లందు, ప్రజాజ్యోతి

## ఉపాధి హామీ పనుల్లో కార్మికుల సంఖ్య పెంచాలి



(మొదటి పేజీ తరువాయి...)

పనులకు హాజరవుతున్నట్లు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ఉపాధి హామీ పనులపై గ్రామస్థులకు మరింత అవగాహన కల్పించి అర్హులైన ప్రతి కుటుంబం నుంచి ఎక్కువ మంది పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ కుటుంబాలకు మరింత ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్మికుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. అనంతరం మాస్టర్ కార్డులను పరిశీలించిన కలెక్టర్, ఒక కుటుంబం నుంచి ఎంతమంది పనులకు హాజరవుతున్నారో పని దినాలు సక్రమంగా నమోదవుతున్నాయా అనే అంశాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. పనుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని ప్రతి కార్మికుడి హాజరు వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పనులు గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని, ముఖ్యంగా నీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ పనులను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో సర్పంచ్ కంగాల అంజలి, డీఆర్డీఓ విద్యాచందన, తహసీల్దార్ శిరీష, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జనగణన హౌస్ లిస్టింగ్‌లో ఖచ్చితత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలి



(మొదటి పేజీ తరువాయి...)

తదితర అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, చార్జ్ ఆఫీసర్లు, హెచ్ఎల్‌బి సిబ్బందితో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోలీకేర్ పాల్గొని పలు మార్గదర్శకాలు జారీ చేశారు. హౌస్ లిస్టింగ్ సమయంలో గృహాల వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం, మౌలిక సదుపాయాల వివరాలు నమోదు చేసే సమయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఎక్కువగా దొర్లుతున్న సాధారణ తప్పులను వివరిస్తూ, వాటిని తక్షణమే సరిచేసే విధానంపై సూపర్వైజర్లు, చార్జ్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. నమోదు చేసిన వివరాలను పునఃపరిశీలించి డేటా ఖచ్చితత్వాన్ని నిర్ధారించాలని తెలిపారు . ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐ డి ఓ సి కార్యాలయం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, సిపిఓ సంజీవరావు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత , పాటు సంబంధిత శాఖల చార్జ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి నాణ్యమైన సమాచార సేకరణకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## 27 మంది మావోయిస్టుల లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి...)

నిషేధిత జార్ఖండ్ జన్ ముక్తి పరిషత్ (జె జె ఏం పీ ) సంస్థకు చెందిన ఇద్దరు తీవ్రవాదులు ఉన్నారు. రాంచీలోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) తడషా మిశ్రా, సీఆర్పీఎఫ్ పోలీస్ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో మావోయిస్టులు ఆయుధాలను త్యజించి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. రూ.33 లక్షల రివార్డు ఉన్న హార్డ్‌కోర్ మావోయిస్టులు లొంగిపోయిన వారిలో ఎనిమిది మంది హార్డ్‌కోర్ మావోయిస్టులు ఉన్నారు. వీరిలో ఆరుగురిపై ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున రివార్డు ఉండగా, మరో ఒకరిపై రూ.2 లక్షలు, ఒక మహిళా మావోయిస్టుపై రూ.1 లక్ష నగదు బహుమతి ప్రకటించబడింది.పోలీసుల వివరాల ప్రకారం లొంగిపోయిన ఈ మావోయిస్టులపై రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో మొత్తం 426 కేసులు నమోదై ఉన్నాయి అని హత్యలు, భద్రతా బలగాలపై దాడులు, బలవంతపు వసూళ్లు, పేలుళ్లు, సాయుధ దాడులు తదితర ఘటనల్లో వీరు పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు.లొంగిపోయిన వారిలో ఏడుగురు సబ్–జోనల్ కమాండర్లు, ఏడుగురు ఏరియా కమాండర్లు, 13 మంది క్రియాశీల కేడర్లు ఉన్నారు.లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు భారీ మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని పోలీసులకు అప్పగించారు. వాటిలో ఒక ఎల్ఎంజీ ఇన్సాస్, నాలుగు ఇన్సాస్ రైఫిళ్లు, తొమ్మిది ఎస్ఎల్ఆర్‌లు,ఒక బోల్ట్ యాక్షన్ రైఫిల్,ఒక పిస్టల్, 31 మ్యాగజైన్‌లు,2,987 లైవ్ కార్ట్రిడ్జ్‌లు, 8 వాకీటాకీలు ఉన్నాయి. భద్రతా బలగాలు నిరంతరం నిర్వహిస్తున్న ఆపరేషన్లు అలాగే జార్ఖండ్ ప్రభుత్వం అమలు చేస్తున్న లొంగుబాటు–పునరావాస విధానం ప్రభావంతోనే మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావడానికి ముందుకు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.లొంగిపోయిన కీలక మావోయిస్టులలో గాడి ముండా అలియాస్ గుల్షన్, నాగేంద్ర ముండా అలియాస్ ప్రభాత్ ముండా, రేఖా ముండా అలియాస్ జయంతి, సాగెన్ అంగారియా అలియాస్ డోకోల్, సులేమాన్ హస్దా అలియాస్ సుని హస్దా, జేజేఎంపీ సభ్యుడు సచిన్ బెక్ ముఖ్యులు.అలాగే దర్శన్ అలియాస్ బింజ్ హస్దా, కరణ్ టియు అలియాస్ దంగూర్, బసుమతి జెరాయ్ అలియాస్





బసు, బైజ్‌నాథ్ ముండా, రఘు కాయం అలియాస్ గుణా, కిషోర్ సిర్కా అలియాస్ దుర్గ సిర్కా, రామ్ దయాల్ ముండా తదితరులు కూడా లొంగిపోయారు.లొంగిపోయిన మహిళా కేడర్లలో వందన అలియాస్ శాంతి, సునితా సర్దార్, సప్నా అలియాస్ సురు కలుండియా, అనీషా కోడా అలియాస్ రాణి ఉన్నారు.లొంగిపోయిన మావోయిస్టులందరికీ రాష్ట్ర ప్రభుత్వ పునరావాస విధానం కింద ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలు ఇతర పునరావాస ప్రయోజనాలు అందజేస్తామని పోలీసులు తెలిపారు. ఆయుధాలను అప్పగించిన వారికి అదనపు ప్రోత్సాహకాలు కూడా ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# రోగులకు ఉత్తమసేవలు అందించాలి

- **వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి... వైస్ చైర్మన్ జూపల్లి, మున్సిపల్ కమిషనర్ దీపక్ రెడ్డి**
- **ప్రభుత్వహాస్పటలలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసిన వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్**

**అశ్వారావుపేట, మే 21, ప్రజాజ్యోతి :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, మున్సిపల్ కమిషనర్



దీపక్ రెడ్డి అన్నారు. గురువారం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ వార్డులను సందర్శించి, రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఖచ్చితమైన సమయపాలన పాటించాలని,ప్రభుత్వ ఆసుపత్రులను నమ్ముకుని వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని,విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వారికి అందుతున్న వైద్యం, మందుల పంపిణీ, అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నవారు ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మందులు ఉచితంగా, సకాలంలో అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డా. మౌనిక, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు మిండా హరిబాబు, చిన్నంశెట్టి శ్రీను, నార్లపాటి మౌనిక, నార్లపాటి దివాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జూపల్లి ప్రమోద్, తాడేపల్లి రవి, నంద్రు రమేష్, కాసాని పద్మ శేఖర్, పలువురు వైద్యాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ షిర్డీసాయిబాబా మందిరాలలో ప్రత్యేక పూజలు

- **అభిషేకాలు, అన్నదానాలలో భారీగా పాల్గొన్న భక్తులు**

**అశ్వారావుపేట, మే 21, ప్రజాజ్యోతి:** మండలం లోని షిర్డీ సాయిబాబా మందిరాలలో గురువారం పురస్కరించుకొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వినాయకపురం గ్రామంలో ఉన్న షిర్డీసాయిబాబా మందిరంలో ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అశ్వారావుపేటలోని జంగారెడ్డిగూడెంరోడ్డులో ఉన్న శ్రీ జ్ఞానసాయి మందిరంలో కొలువుదీరిన సాయినాథునికి మందిర అర్చకులు శుభం దీక్షిత్ ఆధ్వర్యంలో





ఉదయం 5 గంటలకు బాబా మేలుకొలుపుతో ప్రారంభమైన పూజలు 5 గంటల 15 నిమిషాలకు కాకడహారతి 6 గంటలకు బాబాకు పంచామృత అభిషేకాలు నిర్వహించి పూలమాలలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు, అష్టోత్తరం జరిపి భక్తులకు దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నాహారతి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. రాత్రి 7 గంటలకు పల్లకి సేవచేసి, 8:30గంటలకు బాబాపవళింపు సేవను (శేజ్ హారతి) కొనసాగించారు. ఈ కార్యక్రమంలో శ్రీ షిర్డీసాయి సేవ సమితి సభ్యులు, పంబిహరిబాబు, మంగ దొడ్డి మురళీకృష్ణ, ముళ్ళపూడి సూరిబాబు, విమలశ్రీదేవి, రమాదేవి, పృథ్వి , లక్కిరెడ్డి కృష్ణారెడ్డి, గౌరీ, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.




- లక్షల దందాతో ఉద్యోగాల జోరు
- మధ్యవర్తుల వలయంలో మెడికల్ బోర్డు..?
- సింగరేణి మెడికల్ బోర్డు వ్యవహారంపై తీవ్ర విమర్శలు
- రూ.6 నుంచి రూ.8 లక్షల వరకు వసూళ్ల ఆరోపణలు.. విజిలెన్స్ మౌనంపై కార్మికుల్లో ఆగ్రహం
- వారసత్వ ఉద్యోగాలకే ప్రాధాన్యం..?
- సాధారణ నిరుద్యోగులకు అందని సింగరేణి ఉద్యోగాలు

# సింగరేణిలో.... మెడికల్ మాయాజాలం..?

**సింగరేణి సంస్థలో 2025–26 సంవత్సరానికి సంబంధించిన మెడికల్ బోర్డు వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఎప్పుడూ లేనంత క్లిష్ట పరిస్థితులు ఈసారి నెలకొన్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదట మెడికల్ బోర్డు నిర్వహణపై చేతులెత్తేసిన సింగరేణి యాజమాన్యాన్ని కార్మిక సంఘాలు ఒత్తిడి చేసి బోర్డు నిర్వహించేలా చేసినప్పటికీ అసలైన అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు మాత్రం న్యాయం జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి..**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి




కార్మికుల కుటుంబ సభ్యులకు మధ్యవర్తుల ద్వారా అన్యాయం జరుగుతోందని అసలు అనారోగ్యం లేని కొందరికి భారీ మొత్తాలు తీసుకుని మెడికల్ బోర్డు ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారనే సమాచారం వెలువడుతోంది. ఒక్కో కార్మికుడి నుంచి రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నప్పటికీ విజిలెన్స్ విభాగం ఎందుకు మౌనం పాటిస్తోందో అర్థం కావడం లేదని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. అటెండర్ నుంచి మెడికల్ బోర్డు నిర్వహించే వైద్యుల వరకు చేతులు తడిపే వ్యవస్థ ఏర్పడిందని నిజంగా అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుడికి న్యాయం చేసే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తమవుతోంది. 2025 ఫిబ్రవరి 21, 22 తేదీల్లో జరిగిన మెడికల్ బోర్డులో గౌతమ్‌ఖని ప్రాంతానికి చెందిన కొందరికి మెడికల్ మంజూరు చేయడంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే వారి కుటుంబ సభ్యులు ఉద్యోగాల్లో ఉన్నప్పటికీ మళ్లీ ఉద్యోగాలు పొందుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మెడికల్ బోర్డు దందా రోజురోజుకు పెరుగుతుండగా సంస్థలో పనిచేసే కొందరు ఉద్యోగులు కూడా మెడికల్ చేయిస్తాం అంటూ లంచాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే పై అధికారులు వారిపైనే కఠిన చర్యలు తీసుకుంటున్నారని కార్మికులు అంటున్నారు. అయితే అవినీతి చర్యలపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇంతటి అవకతవకల వల్ల సింగరేణి సంస్థకు నష్టం జరుగుతున్నప్పటికీ విజిలెన్స్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని కార్మికులు మండిపడుతున్నారు. సింగరేణి సంస్థలో ఉద్యోగ నోటిఫికేషన్ల విడుదలపై కూడా నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మెడికల్ బోర్డులపైనే దృష్టి పెట్టి సాధారణ నోటిఫికేషన్ల విడుదలపై యాజమాన్యం నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపిస్తున్నారు. ఓపెన్ యూనివర్సిటీలలో డిగ్రీలు పూర్తి చేసినవారు, రెగ్యులర్ ఇంజినీరింగ్ చదివిన యువత కూడా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ అవకాశాలు రావడం లేదని వాపోతున్నారు. వారసత్వ ఉద్యోగాలకే ప్రాధాన్యం ఇస్తూ, సాధారణ నోటిఫికేషన్లను నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని సంఘ నాయకులు ప్రశ్నిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం స్పందించడం లేదని చెబుతున్నారు. ఈ సమస్యలకు ఎప్పుడు పరిష్కారం దొరుకుతుందో...? విజిలెన్స్ విభాగం ఎప్పుడు చురుకుగా పనిచేస్తుందో..? తీసుకుంటున్న జీతాలకు అధికారులు ఎప్పుడు న్యాయం చేస్తారో..? అంటూ కార్మిక లోకం ఎదురుచూస్తోంది.

### ♦ సింగరేణి మెడికల్ బోర్డు వ్యవహారంపై తీవ్ర విమర్శలు

సింగరేణి మెడికల్ బోర్డు వ్యవహారంపై కార్మికుల్లో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలైన అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు న్యాయం జరగడం లేదని మధ్యవర్తుల ద్వారా భారీగా డబ్బులు వసూలు చేసి కొందరికే అవకాశాలు కల్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో మెడికల్‌కు రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు చేతులు మారుతున్నాయన్న ప్రచారం కార్మిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై విజిలెన్స్ విభాగం స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సింగరేణి విజిలెన్స్ విభాగం ముందోస్తూ హెచ్చరికలకు పాల్పడకపోతే మరింత వసూళ్లకు తెర లేపేందుకు మధ్యావర్థులు ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### ♦ సాధారణ నిరుద్యోగులకు అందని సింగరేణి ఉద్యోగాలు

సింగరేణి సంస్థలో సాధారణ ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడంలో యాజమాన్యం నిర్లక్ష్యం చూపుతోందని నిరుద్యోగ యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓపెన్ యూనివర్సిటీలు, రెగ్యులర్ డిగ్రీలు, ఇంజినీరింగ్ పూర్తి చేసిన యువకులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నప్పటికీ అవకాశాలు లేక నిరాశలో ఉన్నారని చెబుతున్నారు. వారసత్వ ఉద్యోగాలపైనే ఎక్కువ దృష్టి పెట్టడం వల్ల సాధారణ అభ్యర్థులకు న్యాయం జరగడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మెడికల్ బోర్డు వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి పారదర్శకంగా ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# సేంద్రీయ వ్యవసాయం... రైతుకు మేలు

- ఉద్యానవన పంటలతో ఆర్థిక భరోసా: శాస్త్రవేత్తలు డా. ఐ.వీ. శ్రీనివాస్ రెడ్డి, డి. స్రవంతి





**అశ్వారావుపేట, మే 21 (ప్రజాజ్యోతి):** ప్రస్తుత రోజుల్లో సేంద్రీయ వ్యవసాయం వైపు అడుగులు వేయడం ద్వారానే రైతులకు మేలు జరుగుతుందని, ముఖ్యంగా ఉద్యానవన పంటల సాగుతో నాణ్యమైన దిగుబడులు సాధించి ఆర్థిక భరోసా పొందవచ్చని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఐ.వీ. శ్రీనివాస్ రెడ్డి, డి. స్రవంతి పేర్కొన్నారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. జె. హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం అల్లిగూడెం గ్రామంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డా. ఐ.వీ శ్రీనివాస్ రెడ్డి, స్రవంతి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు సాంప్రదాయ పద్ధతులతో పాటు ఆధునిక సేంద్రీయ మేళవింపును అలవర్చుకోవాలని సూచించారు. అధిక మోతాదులో రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. సేంద్రీయ పద్ధతుల ద్వారా పండించే పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, దీనివల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గి నికర ఆదాయం పెరుగుతుందని వివరించారు. రైతులు కేవలం సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, లాభదాయకమైన ఉద్యానవన పంటల వైపు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఆయిల్ ఫామ్, కొబ్బరి వంటి ఉద్యానవన పంటల సాగు ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు బిందు, తుంపర్ల సేద్యం వంటి ఆధునిక పద్ధతులను వాడుకుంటూ నీటిని ఆదా చేయవచ్చని రైతులకు సూచించారు. రైతులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తూ నాణ్యమైన విత్తనాలు, సేంద్రీయ ఎరువులను వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి సతీష్, గ్రామపంచాయతీ సెక్రటరీ తేజ, గ్రామ సర్పంచ్ కుంజా శ్రీను,, ఉపసర్పంచ్ కేరం మంగ, విద్యార్థులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే కోరం



**టేకులపల్లి, మే22, ప్రజాజ్యోతి:** నిరుపేద కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి పథకం కొండంత అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం టేకులపల్లి మండల ముత్యాలం పాడు క్రాస్ రోడ్ గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరై, లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. మండలంలో 30 మంది లబ్ధిదారులకు 30,03,480 విలువ గల చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుంది అని ఆయన అన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నపటికీ పేదింటి ఆడబిడ్డ పెళ్లి తల్లి తండ్రులకు భారం కాకుండా ఆర్థిక సహాయాన్ని అందించి పేదలను ఆదుకుంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్య మంత్రివర్యులు రేవంత్ రెడ్డి పాలనలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజలను ఆదుకుంటుందని ఈ వేదికగా తెలియచేసారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వీరభద్రం, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, మండల అధ్యక్షులు లక్కినేని శ్యామ్ , జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఖాదర్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రిలో భద్రగిరి ప్రదక్షణ

- భక్తరామదాసు
- తూములక్ష్మీనరసింహదాసులకు ప్రత్యేక పూజలు



**భద్రాచలం టౌన్, మే 21 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భక్తరామదాసు ట్రస్టు కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో గురువారం శ్రీరామచంద్రుని జన్మ నక్షత్రం పునర్వసును పురస్కరించుకొని భద్రగిరి ప్రదక్షణ నిర్వహించారు. తొలుత ఆలయంలో దృవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గిరి ప్రదిక్షణకు బయలుదేరారు. శ్రీరామ జయరామ జయజయ రామ అంటూ భక్తులు ఆలపిస్తుండగా మేళ తాళాల మధ్య గిరిప్రదిక్షణ కొనసాగింది. ఈ క్రమంలో విస్తా కాంప్లెక్సు వద్ద ఉన్న తూము లక్ష్మీనరసింహదాసు విగ్రహం వద్ద దేవస్థానం వైదిక సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిరి ప్రదిక్షణ ముందుకు సాగింది. తదుపరి ఉత్తరద్వారం వద్ద ఉన్న భక్తరామదాసు విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిరిప్రదిక్షణ రాజవీధి మీదుగా రామాలయంకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

### ››› రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో స్వామి వారికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన అర్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

- మిగులు సోలార్ విద్యుత్ కు విలువ తెచ్చిన సింగరేణి
- మిగులు సోలార్ విద్యుత్ ను నిల్వ చేస్తున్న బీఈఎస్ఎస్
- రాష్ట్ర ప్రభుత్వ ఆదేశంతో రాష్ట్రంలోనే తొలి అతిపెద్ద ప్రాజెక్టు సింగరేణిలో ఏర్పాటు
- నాలుగు నెలల్లోనే సత్ఫలితాలు
- బీఈఎస్ఎస్ తో రూ.26 లక్షల ఆదా




# సోలార్ ఎనర్జీ నిల్వ... సింగరేణికి సిరులు

**రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోనే తొలిసారిగా సింగరేణిలో ఏర్పాటు చేసిన బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ సత్ఫలితాన్ని ఇస్తుంది. పగటిపూట ఉత్పత్తి జరిగే సోలార్ విద్యుత్తులో వినియోగించబడని విద్యుత్తును ఉచితంగా గ్రిడ్ కు సరఫరా చేయకుండా, బ్యాటరీలో నిలువ చేసుకొని, అవసరమైనప్పుడు వాడుకునే అవకాశం కలిగించే ఈ వ్యవస్థ సింగరేణికి ఆర్థిక లబ్ధి చేకూర్చుతుంది.**

● ఇల్లందు, ప్రజాజ్యోతి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు 4 నెలల క్రితం మందమర్రి ఏరియాలోని 28 మెగావాట్ల సింగరేణి సోలార్ ప్లాంట్ కు అనుబంధంగా 1 మెగావాట్ బ్యాటరీ ఎనర్జీ సిస్టమ్ నెలకొల్పడం జరిగింది. ఇందు కోసం రూ.2.5 కోట్లను యాజమాన్యం వెచ్చించింది.

### ♦ బీఈఎస్ఎస్ ఉపయోగం ఏమిటి?

రాష్ట్ర ప్రభుత్వం సౌర విద్యుత్తుకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని సింగరేణితో సహా పలు రాష్ట్ర సంస్థలు సోలార్ విద్యుత్ ను ఉత్పత్తి చేస్తున్నాయి. సింగరేణి సంస్థ ఇప్పటికే 8 చోట్ల 245.5 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. వీటిలో 147 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను ఓపెన్ యాక్సెస్ ప్లాంట్లుగా, మిగిలిన 98.50 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను ఇన్ హౌజ్ ప్లాంట్లుగా గుర్తించి తెలంగాణ విద్యుత్తు గ్రిడ్డులకు అనుసంధానం చేసింది. ఈ ఇన్ హౌజ్ ప్లాంట్ల విద్యుత్తును కూడా తెలంగాణ విద్యుత్ శాఖ గ్రిడ్లకు అనుసంధానం చేసినప్పటికీ విద్యుత్ ఒప్పందం ప్రకారం ఇక్కడ స్థానిక అవసరాలకు వాడగా మిగిలిన విద్యుత్తుకు మాత్రం తెలంగాణ డిస్కములు ఎటువంటి చెల్లింపులు జరపదు. మిగులు విద్యుత్తును కేవలం ఉచితంగానే గ్రిడ్డుకు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ విధంగా ఇన్ హౌస్ ప్లాంట్ల నుండి రోజుకు వేలాది యూనిట్ల మిగులు విద్యుత్తును ఎలాంటి ఆర్థిక ప్రయోజనం లేకుండా గ్రిడ్ కు సరఫరా చేయడం జరుగుతుంది. అయితే ఈ మిగులు విద్యుత్తును కూడా సొమ్ము చేసుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు సింగరేణి సంస్థ రాష్ట్రంలోనే తొలిసారిగా ఒక మెగావాట్ సామర్థ్యం గల బీఈఎస్ఎస్ ను మందమర్రి ప్లాంట్ లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసింది. మందమర్రిలో గల 28 మెగావాట్ల సోలార్ ప్లాంట్ సమర్థంగా పనిచేస్తూ మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలలోని గనులకు, కాలనీలకు అవసరమైన విద్యుత్తును అందిస్తుంది. అయితే స్థానిక విద్యుత్తు అవసరాలకు సరిపోగా ఇంకా కొంత విద్యుత్తు మిగిలిపోతుంది. ఈ నేపథ్యంలో మందమర్రి ప్లాంటు లో జనవరి నెలలో బ్యాటరీ ఎనర్జీ స్టోరీ సిస్టం ను సింగరేణి ఏర్పాటు చేసింది. అప్పటి నుండి ఇప్పటి వరకు బిఈఎస్ఎస్ యూనిట్ స్థానిక అవసరాలకు వినియోగించగా ఇంకా మిగిలిన 3,35,485 యూనిట్ల విద్యుత్తును నిల్వ చేసుకొని అవసరమైన సందర్భంలో వినియోగించుకుంది. తద్వారా సింగరేణి సంస్థకు రూ. 25,66,460 ఆర్థిక లబ్ధి చేకూరింది. ఒక మెగావాటు సామర్థ్యం గల బీఈఎస్ఎస్ యూనిట్ ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్తును ఆదా చేయడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఇక్కడ ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన బీఈఎస్ఎస్ విజయవంతం అవడంపై సింగరేణి యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మరిన్ని ప్రాజెక్టులను చేపట్టేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు యాజమాన్యం ప్రకటించింది.



# అన్ని ప్రాంతాలను అభివృద్దే చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- -అభివృద్ధికి కేరాఫ్ గా తెలంగాణ
- -మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే





**ఇల్లందు, మే 21, ప్రజాజ్యోతి:** అన్ని ప్రాంతాలను అభివృద్దే చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అభివృద్ధికి కేరాఫ్ గా తెలంగాణ నిలుస్తుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. గురువారం ఇల్లందు మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇల్లందు మండలంలోని రాగబోయిన గూడెం పంచాయతీలో రూ. 35 లక్షలతో స్త్రీ శక్తి భవనం, సుదిమళ్ళలో రూ. కోటితో గ్రావెల్ రోడ్డు, ఒడ్డుగూడెం పంచాయతీలో రూ. 20 లక్షలతో సిసి రోడ్డు, మామిడిగుండాల పంచాయతీలో మెడిగుంట గ్రామంలో రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు, సువర్ణపురం గ్రామంలో రూ. 6 లక్షలతో రోడ్డు పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదాలతో కొలువుతీరిన ప్రజా ప్రభుత్వం ప్రజారంజాక పాలనను కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. పట్టణాలకు దీటుగా గ్రామాలను రూ. కోట్లతో అభివృద్ధి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని ఆరోపణలు, విమర్శలు చేసిన వారి మాటలు నమ్మేస్థితిలో ప్రజలు లేరని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేసేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అభివృద్ధి అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వమని గుర్తు చేశారు. అభివృద్ధి పనులను కాలయాపన చేయకుండా పూర్తి నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని, ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, పిఏసిఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, యంపిడిఓ ధన్ సింగ్, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, మాజీ ఎంపీపీలు, మాజీ యంపిటీసిలు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి "అది కర్మయోగి" కార్యక్రమం





- **ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు**

**చర్ల, మే 21: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని ఆర్. కొత్తగూడెం గ్రామపంచాయతీలో "అది కర్మ యోగి" కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామాభివృద్ధి, ప్రజా ఆరోగ్యం, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారాన్ని లక్ష్యంగా చేసుకుని చేపట్టిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది గ్రామంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితులను వైద్యులు పరిశీలించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి తగిన వైద్య సూచనలు అందించడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్య సిబ్బంది సూచించారు.అదేవిధంగా గ్రామ పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. పంచాయతీ సిబ్బందితో గ్రామంలోని ప్రధాన రహదారులు, వీధులు, కాలనీలు శుభ్రం చేయించారు. చెత్తను తొలగించి మురుగు కాల్వలను శుభ్రపరిచారు. నిల్వ నీరు ఉండే ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడి చల్లి దోమల వ్యాప్తి నివారణ చర్యలు చేపట్టారు. గ్రామం పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఒక్కరూ పారిశుధ్య నిర్వహణలో భాగస్వాములు కావాలని ప్రజాప్రతినిధులు కోరారు. గ్రామంలోని తాగునీటి సరఫరా వ్యవస్థను కూడా అధికారులు పరిశీలించారు. మోటార్ పంపులు, పైప్‌లైన్లు, వాటర్ ట్యాంకులను తనిఖీ చేసి నీటి సరఫరాలో ఉన్న సాంకేతిక సమస్యలను గుర్తించారు. కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపగా వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. గ్రామ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు పంచాయతీ కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, పెన్షన్లు, తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలపై గ్రామస్థుల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్. కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవి కుమార్, 10వ వార్డు సభ్యుడు కారం సుధాకర్, 6వ వార్డు సభ్యురాలు చింత కాయల స్వరూప, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు , తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారులు స్నేహపూర్వకంగా వ్యాపారాలు కొనసాగించాలి

- **మోడల్ మార్కెట్ ను పరిశుభ్రంగా ఉంచాలి: ఎమ్మెల్యే**



**ఇల్లందు, మే 21, ప్రజాజ్యోతి:** మున్సిపల్ నూతన మోడల్ మార్కెట్ లో వ్యాపారులు స్నేహపూర్వకంగా వ్యాపారాలు కొనసాగించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. గురువారం స్థానిక రాజస్థానీ సేవా ట్రస్ట్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం, ఇల్లందు చిరు వ్యాపారులకు మార్కెట్ గదుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మోడల్ మార్కెట్ ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గోబీ సెంటర్ వద్ద ఉన్న చిరు వ్యాపారులను కూడా ఈ మోడల్ మార్కెట్ లోకే తరలించాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఇల్లందులో నూతన మోడల్ మార్కెట్ గదుల నిర్మాణానికి బీజం వేయడం జరిగిందని గుర్తు చేశారు. మోడల్ మార్కెట్ లో కొనుగోలు చేసేందుకు వచ్చే దుర్యోధరుల వాహనాల పార్కింగ్ కోసం పాత మార్కెట్ స్థలాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం చిరు వ్యాపారులకు గదుల తాళాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, మున్సిపల్ కమిషనర్ చింత శ్రీకాంత్, కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భోళ్ల సూర్యం, మండల రాము, మున్సిపల్ సిబ్బంది, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు






**ఇల్లందు, మే 21, ప్రజాజ్యోతి:** మాజీ ప్రధాని, దివంగత రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి వేడుకలను గురువారం ఇల్లందు పట్టణ, మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి, జగదాంబ సెంటర్ లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ అభివృద్ధి కోసం పనిచేసిన రాజీవ్ గాంధీ లాంటి గొప్ప నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసే గొప్ప కుటుంబం గాంధీ కుటుంబం అని కొనియాడారు. దేశంలో టెలికం రంగాన్ని తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కిందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల బలోపేతం రాజీవ్ గాంధీ కోసం కృషి చేస్తూ, విద్యకు ప్రాధాన్యతనిస్తూ, జవహర్ నవోదయ విద్యాలయాలు తీసుకువచ్చి విద్యావ్యవస్థను ఎంతో బలోపేతం చేశారని కొనియాడారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజలందరికీ ఉచిత విద్యుత్తు, ఉచిత బస్సు, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు, రైతు రుణమాఫీ వంటి మరెన్నో పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ఒంటెద్దు పోకడలను ఎత్తిచూపుతున్న రాహుల్ గాంధీని ప్రధాని చేసేంతవరకు కాంగ్రెస్ శ్రేణులు నిరంతరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భోళ్ల సూర్యం, మండల రాము, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి,, మాజీ పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డ డానియల్, పులి సైదులు, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ యదళ్లపల్లి అనసూయ, వార్డు కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పూనెం సురేందర్, పాయం కృష్ణ ప్రసాద్, తాటి భిక్షం, కాకటి భార్గవ్, దండుగుల శివ, ఆరేం కిరణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రావులపల్లి రాంప్రసాద్



**భద్రాచలం టౌన్ , మే 21 ప్రజాజ్యోతి** బీఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిగా రావులపల్లి రాంప్రసాద్‌ను పార్టీ అధినేత కేసీఆర్ నియమించారు. త్వరలో ప్రారంభం కానున్న డిజిటల్ సభ్యత్వ నమోదును విజయవంతంచేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌చార్జిలను గురువారం ప్రకటించారు. ఈ క్రమంలో భద్రాచలం నియోకవర్గ ఇన్‌చార్జిగా రావులపల్లి రాంప్రసాద్‌ను నియమించారు. రావులపల్లి రాంప్రసాద్ నియామకం పట్ల బీఆర్ఎస్ నాయకులు మానె రామకృష్ణతో పాటు ఇతర నాయకులు అభినందనలు తెలిపారు.

## రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ నాయకుల నివాళులు



**చర్ల, మే 21:(ప్రజా జ్యోతి ):** మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని చర్ల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ నాయుడు నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సత్యనారాయణపురంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ నాయుడు మాట్లాడుతూ దేశంలో టెలికాం, కంప్యూటర్ రంగాల అభివృద్ధికి రాజీవ్ గాంధీ కృషి ఎంతో గొప్పదన్నారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పించిన నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు జవహర్ నవోదయ విద్యాలయాలను ప్రారంభించారని గుర్తుచేశారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి రాజ్యాంగ సవరణలు తీసుకువచ్చి గ్రామీణాభివృద్ధికి పునాది వేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరీ నల్లపు దుర్గ ప్రసాద్, డీసీసీ ఉపాధ్యక్షుడు చీమలమరి మురళి, డీసీసీ జనరల్ సెక్రటరీ సోడి చలపతి, బీసీ సెల్ నాయకుడు ఆర్వీ రమణ, ఎస్సీ సెల్ నాయకుడు కారంపూడి సల్మాన్, ఎస్టీ సెల్ నాయకుడు తాటి రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇందాల రమేష్, ఆవుల పూలరావు, మున్నేని అరవింద్, పోలిన లంకరాజు, బ్రహ్మానంద రెడ్డి, గుండెపూడి భాస్కర్ రావు, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, ఆలం ఈశ్వర్, రాము, తోకల దిలీప్, కుమార్, తాటి బాలకృష్ణ, సోమరాజు, చర్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ సామ్రాజ్యం, సత్యనారాయణపురం సర్పంచ్ జాగా గౌతమి, కలివేరు ఉపసర్పంచ్ రుక్మిణి, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు కనీస వేతనాలు పెంచడం హర్షణీయం

**బూర్గంపహాడ్, మే 21 (ప్రజా జ్యోతి ):** తెలంగాణ రాష్ట్ర కనీస వేతనమండలి 73 షెడ్యూల్‌కు సంబంధించి కార్మికులకు కనీస వేతనాల పెంపుపై ఐఎన్‌టయూసీ అధ్యక్షులు గోనే రామారావు గురువారం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 1.11కోట్ల మంది కార్మిక కుటుంబాలకు ఈ వేతన పెంపుతో మేలు చేసి కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపిందన్నారు. పెరుగుతున్న ధరలు, జీవన వ్యయాల సందర్భంగా ఈ నిర్ణయం కార్మిక కుటుంబాల్లో ఉపశమనం కలిగించిందన్నారు.కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈ నిర్ణయం ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. రాష్ట్ర కనీస వేతన మండలి సభ్యుడుగా ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి మండలిలో సభ్యులుగా ఉండటం సంతోషంగా ఉందని, ఈ వేతన పెంపులో పిచ్చిరెడ్డి కీలకపాత్ర పోషించారన్నారు. వేతన పెంపు పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వేతన మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్, మంత్రివర్గ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక










**చర్ల, మే 21:(ప్రజా జ్యోతి):** తెలంగాణ వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం చర్ల మండల నూతన కమిటీని గురువారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా కార్మికుల మండల కన్వీనర్‌గా ఉడుగుల షారోని ఎన్నిక కాగా, మండల ప్రధాన కార్యదర్శిగా బందెల చంటి, మండల అధ్యక్షులుగా దొడ్డి హరినాగవర్మలను ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంఘం ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ముఖ్యంగా ఉపాధి హామీ పథకంలో పని చేసే కార్మికులకు రోజుకు రెండు సార్లు ఫోటోలు తీసే విధానం కార్మికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ విధానాన్ని వెంటనే రద్దు చేసి కార్మికులకు సౌకర్యవంతమైన విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే మండలంలోని గ్రామీణ పేదలు, మహిళా కార్మికులు, కూలీల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. పోడు సాగుదారుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు చేపడతామని, అటవీ భూములపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులు, పేద రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు.నూతన కమిటీ ఎన్నికతో సంఘ కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘ కార్యకర్తలు, మహిళా కార్మికులు, గ్రామీణ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కంప్యూటర్ విప్లవానికి రాజీవ్ గాంధీనే పునాది: పరిమి శ్రీనివాస్

- **భద్రాచలంలో మాజీ ప్రధాని వర్ధంతి వేడుకలు.. ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ శ్రేణులు**



**భద్రాచలం టౌన్ , మే 21 ప్రజాజ్యోతి** భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వైపు నడిపించి, కంప్యూటర్ యుగానికి పునాది వేసిన మహోన్నత నాయకుడు మాజీ ప్రధానమంత్రి, భారతరత్న శ్రీ రాజీవ్ గాంధీ అని భద్రాచలం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరిమి శ్రీనివాస్ కొనియాడారు. రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం భద్రాచలం సాయిబాబా ఆలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి కాంగ్రెస్ శ్రేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరిమి శ్రీనివాస్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పరిమి శ్రీనివాస్ మాట్లాడుతూ..నేటి యువత ఆస్వాదిస్తున్న ఆధునిక సాంకేతిక వ్యవస్థ, కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పులు, డిజిటల్ భారత నిర్మాణానికి రాజీవ్ గాంధీ దూరదృష్టే ప్రధాన కారణమన్నారు. దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం పెరగాలనే సంకల్పంతో ఆయన అనేక సంస్కరణలు తెచ్చారని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. రాజీవ్ గాంధీకి నివాళులర్పించిన వారిలో జిల్లా కాంగ్రెస్ నాయకులు అడబాల వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు బంధం శ్రీనివాస్ గౌడ్, సాయిబాబా, తమ్మళ్ల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వాసిరెడ్డి సాంబ, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు అలీమ్, జిల్లా మహిళా కార్యదర్శి పందాల సరిత పాల్గొన్నారు. అలాగే సేవాదళ్ ఏ బ్లాక్ అధ్యక్షుడు అశోక్, మండల సేవాదళ్ అధ్యక్షుడు శీలం రామ్మోహన్ రెడ్డి, కోలపూడి వరుణ్, శ్రీను (చిన్న యేసు), మహిళా నాయకురాలు భోధ మని, సీనియర్ నాయకులు తరుణ్ మిత్రతో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించారు.

# భక్తిశ్రద్ధలతో ముగిసిన భగవద్గీత సప్తావాహం

- **"గీత చదివితే రాత మారుతుంది": స్వామీజీ**







**చర్ల, మే 21: (ప్రజా జ్యోతి ):** చర్ల మండల కేంద్రంలోని శ్రీ వాణి విద్యానికేతన్ ప్రాంగణంలో మే 14వ తేదీ నుంచి అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన భగవద్గీత సప్తావాహం కార్యక్రమం బుధవారం సాయంత్రం ఘనంగా ముగిసింది. వారం రోజుల పాటు కొనసాగిన ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో చర్లలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. ప్రతి రోజూ సాయంత్రం 5.30 నుంచి 7.30 వరకు భక్తులతో కళకళలాడిన కార్యక్రమంలో మహిళలు, యువత, చిన్నారులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని గీతా బోధనలను ఆసక్తిగా శ్రద్ధగా ఆలకించారు. సప్తావాహంలో ప్రముఖ ఆధ్యాత్మిక వక్త కృష్ణదాస్ స్వామీజీ భగవద్గీతలోని ముఖ్యమైన శ్లోకాల భావార్థాలను ఎంతో సరళంగా, జీవితానికి అన్వయించుకునే విధంగా వివరించారు. ఆధునిక సమాజంలో మనిషి ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడులు, కుటుంబ సమస్యలు, ఆందోళనలు, అస్థిర జీవనశైలికి భగవద్గీతే సరైన మార్గదర్శి అని ఆయన పేర్కొన్నారు. భగవద్గీతలోని ప్రతి శ్లోకం మానవ జీవితాన్ని సన్మార్గంలో నడిపించే శక్తిని కలిగి ఉందని చెప్పారు. ప్రతిరోజూ నిర్వహించిన గీతా పారాయణం, ఆధ్యాత్మిక ప్రసంగాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు గీతా బోధనల ద్వారా మానసిక ప్రశాంతతను పొందామని, జీవితంపై కొత్త దృక్పథం ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. సప్తావాహం ముగింపు సందర్భంగా స్వామీజీ వారం రోజులుగా బోధించిన అంశాలపై ప్రత్యేకంగా భగవద్గీత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో సుమారు 60 మంది పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్న పిల్లలు కూడా గీతపై ఆసక్తి కనబరిచి పరీక్ష రాయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పరీక్షలో ప్రతిభ కనబరిచిన విజేతలకు సభా వేదికపై ఘనంగా బహుమతులు అందజేశారు.

పెద్దల విభాగం విజేతలు:
ప్రథమ స్థానం – మీసాల వినీల
ద్వితీయ స్థానం – చైతన్య
తృతీయ స్థానం – ఆలం అనూష

పిల్లల విభాగం విజేతలు:
ప్రథమ స్థానం – వేములపల్లి తీర్థశ్రీ
ద్వితీయ స్థానం – సిహెచ్ కార్తీక్
తృతీయ స్థానం – వేదశ్రీ

విజేతలకు జ్ఞాపికలు, భగవద్గీత గ్రంథాలు, ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. చిన్నారులు గీతపై చూపిన ఆసక్తిని సభలో పాల్గొన్నవారు అభినందించారు. భవిష్యత్తులో పిల్లలకు మరిన్ని ఆధ్యాత్మిక పోటీలు నిర్వహింస్తామని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా కృష్ణదాస్ స్వామీజీ మాట్లాడుతూ భగవద్గీత కేవలం ఒక మతపరమైన గ్రంథం కాదని, అది మానవ జీవితాన్ని సార్థకం చేసే జీవన విజ్ఞాన శాస్త్రమని పేర్కొన్నారు. కురుక్షేత్ర సంగ్రామంలో కర్తవ్య విముఖుడై నిరాశలో కూరుకుపోయిన అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన బోధనే భగవద్గీతగా రూపుదిద్దుకుందని వివరించారు. జీవితంలో ఎలాంటి పరిస్థితులు వచ్చినా ధైర్యం కోల్పోకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించాలని గీత బోధిస్తుందని అన్నారు. "గీత చదివితే రాత మారుతుంది" అని పేర్కొంటూ ప్రతి కుటుంబంలో భగవద్గీత పఠనం అలవాటు కావాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆధ్యాత్మికత వైపు మళ్లాల్సిన అవసరం ఉందన్నారు. గీత మనిషిలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, ధర్మబద్ధతను పెంపొందిస్తుందని తెలిపారు. కలియుగంలో "హరే కృష్ణ హరే రామ" మహామంత్రాన్ని జపించడం ద్వారా మానసిక ప్రశాంతత, భగవంతుని కృప లభిస్తాయని స్వామీజీ చెప్పారు. భక్తితో నామస్మరణ చేస్తే జీవితంలో ఉన్న కష్టాలు తొలగి సుఖసంతోషాలు కలుగుతాయని తెలిపారు. సమాజంలో శాంతి, సత్సంబంధాలు నెలకొనాలంటే ఆధ్యాత్మిక విలువలు పెంపొందాలని అన్నారు.చివరిగా కార్యక్రమ నిర్వహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ భగవద్గీత సప్తావాహానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన దాతలు, సేవాభావంతో పనిచేసిన వాలంటీర్లు, భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సనాతన ధర్మంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో నైతిక విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, యువతలో మంచి ఆలోచనలు పెరగడానికి దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా మహాప్రసాద వితరణ నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఇరసవడ్ల రాము, మీసాల శ్రీనివాస్, మైనేని పద్మజ, వెంకట్రావు తదితరులతో పాటు ధర్మ జాగరణ పరిరక్షణ సమితి, వనవాసి కళ్యాణ పరిషత్, సేవాభారతి, విశ్వహిందూ పరిషత్, సనాతన హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు, స్థానిక ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి





**టేకులపల్లి,మే22,ప్రజాజ్యోతి:**దేశానికి సాంకేతికతను తీసుకువచ్చింది రాజీవ్ గాంధీనేనని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం టేకులపల్లి మండల బోడు క్రాస్ రోడు వద్ద ఉన్న రాజీవ్ గాంది విగ్రహనికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి, ఉపాధి హామీ పథకం పనిచేస్తున్న కూలీలకు అరటిపండ్లను మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందు తున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. దేశంలో బీదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయ న చేసిన కృషి ఎప్పటికి మరవలేమని కొనియాడారు. సాంకేతిక విప్లవం భారతదేశంలో టెలికాం విప్లవానికి, కంప్యూటర్ యుగానికి రాజీవ్ గాంధీనే ఆద్యుడన్నారు .18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి, యువతకు రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పించారని .నవోదయ విద్యాలయాలు గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి జవహర్ నవోదయ విద్యాలయాలను ప్రారంభించా రన్నారు.స్థానిక సంస్థలు, పంచాయతీ రాజ్ వ్యవస్థల బలోతీకరణకు రాజ్యాంగ సవరణలు తెచ్చారని దేశానికి వారు అందించిన సేవలను ఈ వేదికగా ప్రజలకు తెలియచేసారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లక్కినేని శ్యామ్ గారు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ గారు, మండల నాయకులు ఈది గణేష్, రెడ్యానాయక్, పోశాలు,కాలే ప్రసాద్, లక్ష్మయ్య, రాందాస్, శివ, బానోత్ రవి, గణేష్, ఈశ్వర్, సంజయ్, సర్పంచులు కోరం సుభాష్ చంద్ర బోస్, కోరం హనుమంతు,తదితర నాయకులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో గంజాయి పట్టివేత

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- నిందితులకు రిమాండ్ కు తరలింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ అరుణ్ కుమార్




**భద్రాచలం టౌన్, మే 21 ప్రజాజ్యోతి** భద్రాచలం పట్టణ పరిధిలో పోలీసులు బుధవారం రాత్రి జరిపిన వాహనాల తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. ఒడిస్సా నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ. 6,46,400 విలువైన 12.928 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి పట్టణ ఎస్ఐ పి.శ్యాం ప్రసాద్ తన సిబ్బందితో కలిసి భద్రాచలం ఊరి చివరన ఉన్న కొల్లుగూడెం వెళ్లే ర్యాంప్ వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కూనవరం రోడ్ వైపు నుండి భద్రాచలం వైపు వస్తున్న ఒక మోటార్ సైకిల్‌ను ఆపి తనిఖీ చేశారు. బైక్‌పై ఉన్న భద్రాచలంకు చెందిన మురళీకృష్ణ, దుమ్ముగూడెం మండలానికి చెందిన గుండి వంశీ కృష్ణ, తెల్లం ముఖేష్‌లను విచారించగా అనుమానాస్పద సమాధానాలు చెప్పారు. దీంతో వారి వద్ద ఉన్న బ్యాగులను పరిశీలించగా.. రెండు ప్యాకెట్లలో ప్యాక్ చేసి ఉన్న 12.928 కేజీల ప్రభుత్వ నిషేధిత గంజాయి లభ్యమైంది. ఒడిస్సాకు చెందిన విక్రమ్, శంకర్ అనే వ్యక్తుల వద్ద దీనిని కొనుగోలు చేసి భద్రాచలం తరలిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. పంచనామా నిర్వహించి రూ. 6.46 లక్షల విలువైన గంజాయితో పాటు, రవాణాకు ఉపయోగించిన మోటార్ సైకిల్, నిందితుల వద్ద ఉన్న రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు సీజ్ చేశారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా, భద్రాచలం టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ వి.సతీష్ కేసు నమోదు చేశారు. దుమ్ముగూడెం ఇన్స్పెక్టర్, భద్రాచలం ఇంచార్జ్ అయిన వెంకటప్పయ్య నిందితులను రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు.

**తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి: డీఎస్పీ** ఈ సందర్భంగా భద్రాచలం డీఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా చేసేవారిపై, విక్రయించేవారిపై, అలాగే వారికి సహకరించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు.

తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచి, వారు వ్యసనాలకు దూరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గంజాయి విక్రయాలు, రవాణా, నిల్వ గురించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ స్పష్టం చేశారు.

## జిన్నలగూడెంలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం





**ఆళ్ళపల్లి.మే21.ప్రజాజ్యోతి** మండల పరిధిలో మర్కోడు పంచాయతీ పరిధిలోని జిన్నలగూడెం గ్రామంలో 90 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఈరోజు సర్పంచ్ సుతారీ రమాదేవి, ఉపసర్పంచ్ వగలబోయిన సతీష్ అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పడిగే సమ్మయ్య, తాటికొండ వెంకటాచారి, సుతారి కృష్ణ, కోనేటి వీరబాద్రాచరి.ముక్తర్ పాషా, పర్వీన్, ముప్పారపు రాము, ఊళ్ళోజు భరత్, బూర్ల రవి, గ్రామ పటేల్ సుతారి రామ్మూర్తి దొర, కొమరం ముసలయ్య, కొమరం రంగయ్య, కొరసా మల్లయ్య, వార్డు సభ్యులు కొమరం రామారావు, పాయం వసంత, కొమరం రజిత మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాసిఫికేషన్ దిశగా సింగరేణి



**ఇల్లందు, మే 21, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ గ్యాసిఫికేషన్ దిశగా ముందు సాగుతుండం పట్ల ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్, రాష్ట్ర మినిమం ఏజ్ కార్పొరేషన్ చైర్మన్ జనక్ ప్రసాద్ హర్షం వ్యక్తం చేసినట్లు ఐఎన్టియుసి ఇల్లందు ఏరియా ఉపాధ్యక్షుడు జె వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమావేశమై బొగ్గు గ్యాసిఫికేషన్ దిశగా సింగరేణి ముందడుగుకు కేంద్ర సహకారం కోరడం జరిగిందన్నారు. డిప్యూటీ సీఎం కోల్ ఇండియా తరహాలో గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై పనిచేసేందుకు సింగరేణి ఆసక్తి చూపడం సంతోషకరమని తెలిపారు. కొయగూడెం బ్లాక్–III కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్–II మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారని పేర్కొన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు గ్యాసిఫికేషన్ అవకాశాలు, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్–II మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారన్నారు. బొగ్గును కేవలం సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తికే పరిమితం చేయకుండా, భవిష్యత్ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విలువ ఆధారితంగా వినియోగించాల్సిన అవసరం ఉందని తెలిపారన్నారు. దేశవ్యాప్తంగా బొగ్గు గ్యాసిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, సింగరేణి కూడా ఆ దిశగా ముందడుగు వేయడానికి సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి వివరించారని పేర్కొన్నారు. కోల్ ఇండియా చేపడుతున్న గ్యాసిఫికేషన్ కార్యక్రమాల తరహాలోనే, సింగరేణి కూడా తన బొగ్గు వనరులను ఆధునిక సాంకేతికతతో మరింత సమర్థవంతంగా వినియోగించే అవకాశాలను పరిశీలిస్తుందని, బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గు వనరులకు అదనపు విలువ కల్పించడంతో పాటు, ఇంధన భద్రత, పారిశ్రామిక వినియోగాలు, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని అన్నారన్నారు. ఇందుకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం, విధానపరమైన సహకారం, కేంద్ర పథకాల అనుసంధానంలో బొగ్గు మంత్రిత్వ శాఖ సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు. సింగరేణి దక్షిణ భారతదేశ బొగ్గు సరఫరా, విద్యుత్ రంగ అవసరాల తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న సంస్థ అని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సింగరేణికి కొత్త బొగ్గు వనరుల సమీకరణ అత్యవసరమని, గోదావరి వ్యాలీ కోల్ ఫీల్డ్స్ పరిధిలోని కొయ్యగూడెం బ్లాక్–III తెలంగాణ విద్యుత్ అవసరాలకు కీలకమని, గతంలో ఈ బ్లాక్ వేలంలో కేటాయించబడినప్పటికీ నాలుగేళ్లు గడిచినా కార్యకలాపాలు ప్రారంభం కాలేదని, ఈ నేపథ్యంలో కొయ్యగూడెం బ్లాక్–IIIను సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారన్నారు. తాడిచెర్ల కోల్ బ్లాక్–II బ్లాక్‌కు సంబంధించి సింగరేణి ఇప్పటికే ప్రీ–మైనింగ్ కార్యకలాపాలు, అన్వేషణ పనులు చేపట్టిందని, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని, తాడిచెర్ల కోల్ బ్లాక్–II అభివృద్ధి సింగరేణి భవిష్యత్ అవసరాలకు, తెలంగాణ విద్యుత్ భద్రతకు కీలకమని, తాడిచెర్ల కోల్ బ్లాక్–IIకు యంయండిఆర్ చట్టం, 1957లోని సెక్షన్–5 కింద ముందస్తు అనుమతి మంజూరు చేసి, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరినట్లు పేర్కొన్నారన్నారు. ఈ అంశాలపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, సింగరేణి బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రణాళికలు, కొయ్యగూడెం బ్లాక్–III కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్–II మైనింగ్ లీజ్ అంశాలపై సంబంధిత కేంద్ర, రాష్ట్ర అధికారులు, సింగరేణి ప్రతినిధులతో త్వరలో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా సింగరేణి సంస్థలో ఐఎన్టీయుసీ కృషి వల్లనే కార్మికులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని, త్వరలో ఇల్లందు ఏరియాలోను పూసపల్లి ఓసి ప్రారంభం అవుతుందని, 2028లో కోయగూడెం పిట్ 3 ప్రారంభించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం, ఐఎన్టియుసి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని స్పష్టం చేసినట్టు తెలిపారు.

## రాజీవ్ గాంధీకి ఘన నివాళులు

- రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం:
- కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బత్తుల అంజి



**ములకలపల్లి, మే 21 ప్రజాజ్యోతి:** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా గురువారం ములకలపల్లి మండల కేంద్రంలోని రాజుపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తుల అంజి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. రాజీవ్ గాంధీ ఆధునిక భారత నిర్మాణానికి పునాది వేసి టెలికాం, కంప్యూటర్ రంగాల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. 18 ఏళ్ల వారికి ఓటు హక్కు కల్పించడం, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం చేయడం ఆయన దూరదృష్టికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి జహీరుద్దీన్, సర్పంచ్ కొర్సా చంద్రలేఖ, ఉప సర్పంచ్ పువ్వాల లలితారావు, యూత్ కాంగ్రెస్ నాయకుడు పాలకుర్తి సుమిత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో సమస్యలు పరిష్కరించాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు శంకర్ నాయక్



**ములకలపల్లి,మే 21, ప్రజాజ్యోతి** మండలంలోని వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గూగులోత్ శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ నాయకులతో కలిసి మండల ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర జాప్యం నెలకొనడంతో రైతులు రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంటాలు, గన్నీ బ్యాగులు, హమాలీలు, లారీలు సరిపడా లేకపోవడంతో ధాన్యం నిల్వలు భారీగా పేరుకుపోతున్నాయని తెలిపారు. మొక్కజొన్న రైతులు రోడ్లపైనే గడుపుతున్న దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. "తరుగు", "తేమ" పేరుతో రైతుల ధాన్యంపై భారీ కోతలు విధిస్తూ దళారులు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. రైతుల కష్టానికి సరైన ధర దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని రక్షించేందుకు తార్పాలిన్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదును వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పూనెం నవీన్ కుమార్, బానోత్ మల్లేష్, తేజావత్ పార్వతి, గూగులోత్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచలో రెండు రోజులపాటు నీటి సరఫరా అంతరాయం

**పాల్వంచ, మే 21, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణంలోని బిసిఎం రోడ్డు అంబేద్కర్ సెంటర్ ప్రధాన కూడలి వద్ద మంచినీటి పైప్‌లైన్ మరమ్మత్తు పనులు చేపట్టనున్న నేపథ్యంలో పట్టణంలో రెండు రోజులపాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మే 22 మరియు 23 తేదీల్లో నిర్వహించనున్న మరమ్మత్తు పనుల కారణంగా నీటి సరఫరా నిలిపివేయాల్సి వస్తుందని తెలిపారు. అందువల్ల పట్టణ ప్రజలు ముందస్తుగా అవసరమైన మేరకు మంచినీటిని నిల్వ చేసుకుని అధికారులకు సహకరించాలని కోరారు.

## టేకులపల్లి ఎంఈఓపై కలెక్టర్ కు పిర్యాదు

- సెన్సెస్ 2027 విధుల కేటాయింపులో జరిగిన అవినీతి అవకతవకలపై నిగ్గు తేల్చాలని టీఎస్ యుటిఎఫ్ డిమాండ్



**టేకులపల్లి,మే22,ప్రజాజ్యోతి** :టేకులపల్లి మండల విద్యాశాఖాధికారి ఎ జగన్ సెన్సెస్-2027 విధుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పాటించకుండా ఇష్టానుసారంగా డ్యూటీలు కేటాయించారని టీఎస్ యూటీఎఫ్ భద్రాద్రి జిల్లా కమిటీ సభ్యులు ఆరోపించారు.ఈ సీనియారిటీ జాబితా ప్రకారం 1997 ,1998, 2000 డీఎస్సీ సీనియర్ ఉపాధ్యాయులను పక్కనపెట్టి జూనియర్లకు సూపర్వైజర్ బాధ్యతలు అప్పగించారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్ అంకిత్ ను మర్యాద పూర్వకంగా కలిసి గురువారం వినతి పత్రం అందజేయడం జరిగింది.2024 ప్రమోషన్ పొందిన వారికి సూపర్వైజర్ డ్యూటీలు ఇవ్వడం,ఇటీవలే సస్పెన్షన్ గురై మండలంలో ఒక పాఠశాలనందు జాయిన్ అయిన ఉపాధ్యాయుడికి సూపర్వైజర్ డ్యూటీ కేటాయించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. మండలంలోని కొన్ని పాఠశాలల నుండి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులకు జనగణన విధులు కేటాయించడంతో పాఠశాలల నిర్వహణపై తీవ్ర ప్రభావం పడుతోందని తెలిపారు. ఫిబ్రవరి,మార్చి నెలల్లో 10వ తరగతి పరీక్షలు ఉండటంతో విద్యార్థుల ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో పాఠశాల నుండి ఒక్కరికి విధులు కేటాయించి ఉంటే నిర్వహణలో ఇబ్బందులు ఏర్పడవని అన్నారు. కొంతమంది ఎన్యూమరేటర్లకు 2 నుంచి 3 బ్లాకులు వేర్వేరు గ్రామపంచాయతీల్లో కేటాయించడం వల్ల తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జనగణన సర్వే ప్రారంభమైన పది రోజుల తర్వాత కూడా బ్లాక్ రూట్ మ్యాప్ మారిందంటూ తాహసీల్దార్ కార్యాలయం నుంచి ఫోన్లు చేసి అదనపు ఇండ్ల గణన చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఎంఇఓ ఉద్దేశపూర్వకంగా కొంతమంది మహిళా ఉపాధ్యాయినిలను పని చేసే పాఠశాలల నుంచి సుమారు 15 నుంచి 18 కిలోమీటర్ల దూరంలో విధులు కేటాయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.సెన్సెస్-2027 విధుల కేటాయింపులో సీనియారిటీ పాటించకుండా అవకతవకలకు పాల్పడిన టేకులపల్లి మండల విద్యాశాఖాధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో టేకులపల్లి మండల అధ్యక్షులు హరికుమార్,ప్రధాన కార్యదర్శి టి లక్ష్మణ్,రాష్ట్ర కార్యదర్శి బి రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు బి కిషోర్ సింగ్,జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య,జిల్లా కార్యదర్శి హాతీరామ్,జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వీరన్న,మండల ఎఫ్డబ్ల్యూఎఫ్ కన్వీనర్ రామచంద్రరావు,చందర్ సింగ్ పాల్గొన్నారు.

## పాల్వంచ కార్టూనిస్ట్ సుభానికి బహుమతి





**పాల్వంచ, మే 21, ప్రజాజ్యోతి:** పాల్వంచకు చెందిన కార్టూనిస్ట్ సుభాని రాష్ట్రస్థాయి కార్టూన్ పోటీల్లో ప్రతిభ కనబర్చి బహుమతి అందుకున్నారు. తెలుగు హాస్య పత్రిక హాస్యానందం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్టూన్ పోటీల్లో ఆయన గీసిన కార్టూన్ ఎంపికైంది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి లో బుధవారం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో మాజీ టీఆర్ఎస్ ప్రభుత్వ సలహాదారు రమణాచారి, దర్శకుడు ఆదిత్య చేతుల మీదుగా సుభానికి నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. తొలి తెలుగు కార్టూనిస్ట్ తలిశెట్టి రామారావు జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో కార్టూనిస్టులు పాల్గొన్నారు. మొత్తం సుమారు 850 కార్టూన్లు పోటీలో పాల్గొనగా, అందులో 45 కార్టూన్లు ఎంపికయ్యాయి. సెల్‌ఫోన్ ఛార్జింగ్ కోసం ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను క్యాప్షన్ లేకుండా వినూత్నంగా చిత్రీకరించిన సుభాని కార్టూన్‌కు విశేష ప్రశంసలు లభించాయి. కార్యక్రమంలో హాస్యానందం సంపాదకుడు రాము, నటులు జెన్నా, దైవజ్ఞ శర్మ, కార్టూన్ వాచ్ ఎడిటర్ త్రయంబక శర్మతో పాటు ప్రముఖ కార్టూనిస్టులు బాచి, సరసి, అరుణ్, ప్రసాద్ కాజా, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు తెలుసుకుందాం....పరిష్కరిద్దాం





- గడప గడపకు పాద యాత్ర
- ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రజలే పాలకులు : జిల్లా కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజి
- హలో గుడ్ మార్నింగ్ ములకలపల్లి
- వినూత్న కార్యక్రమానికి శ్రీకారం



**ములకలపల్లి, మే 21 ప్రజాజ్యోతి:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టే లక్ష్యంతో భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తుల అంజి మండల కేంద్రంలో హాలో గుడ్ మార్నింగ్ ములకలపల్లి అంటూ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బుధవారం మండలంలోని పురవీధులు, విజయపురి కాలనీలో గడపగడపకు పాదయాత్ర నిర్వహిస్తూ స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయపురి కాలనీలో సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు వల్ల కోతుల బెడద తగ్గిందని స్థానికులు తెలిపారు. ఇందుకు అంజి గారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు రాని వారు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడి ఇంటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

అలాగే ఇళ్లు రాని అర్హులందరికీ రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని తెలిపారు. జూన్ 2న గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు.

అనారోగ్యంతో చికిత్స పొందిన వారు ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే ములకలపల్లి మండల ప్రజల దీర్ఘకాలిక కోరిక అయిన డ్రైనేజీ వ్యవస్థకు మంజూరు లభించిందని తెలిపారు. కళ్యాణలక్ష్మి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి సర్పంచ్‌తో సంతకాలు చేయించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి జహీరుద్దీన్, సర్పంచ్ కొర్సా చంద్రలేఖ, ఉప సర్పంచ్ పువ్వాల లలితారావు, కార్యదర్శి చేకూరి రవి, వార్డు సభ్యులు దిగ్గి సంపత్, ముదిగొండ శ్రీను, ఊకే వెంకటమ్మ, వీరునాయక్, జంపాల రమణ, దేవుళ్ల రమణతో పాటు కాంగ్రెస్ నాయకులు గాడి తిరుపతిరెడ్డి, శనగపాటి అంజి, శ్రీరాములు నాగేశ్వరరావు, మేకల రాజేష్, పాలకుర్తి సుమిత్, గంట వెంకటేశ్వర్లు, పొన్నూరు హరి, గుంటూరు కృష్ణ, జరుపుల బాలాజీ, నరి మేకల, స్థానిక గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బక్రీద్ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా



**పాల్వంచ, మే 21, ప్రజాజ్యోతి:** బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశించారు. ఈ మేరకు గురువారం పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్ట్‌ను ఎస్పీ రోహిత్ రాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పండుగ నేపథ్యంలో పశువులను అక్రమంగా తరలించే వాహనాల తనిఖీల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాల సరిహద్దుల నుంచి జరిగే పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి సమయాల్లో విధులు నిర్వహించే సిబ్బంది డ్రాగన్ లైట్లు, బ్యాటన్‌లు వెంట ఉంచుకోవడంతో పాటు రిఫ్లెక్టివ్ జాకెట్లు ధరించాలని సూచించారు. అలాగే చెక్‌పోస్ట్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సంబంధిత పత్రాలను పరిశీలించాలని ఆదేశించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్-100కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని, చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కాంగ్రెస్‌తో పేదవాడి సొంతింటి కల సహకారం: ఎమ్మెల్యే కోరం



**టేకులపల్లి,మే22,ప్రజాజ్యోతి:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సహకారం అవుతుందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టించేశారు. గురువారం టేకులపల్లి మండలంలోని ఏ కాలనీ తండాలో భానోత్ సునీత రామ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించుకున్న గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథులుగా హాజరై నూతన ఇంటిని ప్రారంభించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్యను దంపతులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు జూన్ 2వ తేదీ నుండి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ళు ప్రారంభం అవుతుందని అని అన్నారు. ఇల్లందు నియోజకవర్గంలో ఇప్పటివరకు 3500 ఇళ్ళు ఇచ్చామని అన్నారు. ఐటీడీఏ నుంచి అదనంగా ఏజెన్సీ ప్రాంతం అయిన మన నియోజకవర్గానికి అదనంగా 1500 ఇళ్ల పట్టాలు అందించామన్నారు. అర్హులైన ప్రతీ పేదవాళ్లకి ఇళ్ళు మంజూరు చేయటం జరుగుతుంది అన్నారు, విడతల వారీగా ప్రతీ పేద కుటుంబానికి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లక్కినేని శ్యామ్ , నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ , హౌసింగ్ ఏఈ గణేష్ , మండల నాయకులు ఈది గణేష్,రెడ్యానాయక్, పోశాలు,కాలే ప్రసాద్, లక్ష్మయ్య, రాందాస్, శివ,బానోత్ రవి, గణేష్, ఈశ్వర్,సంజయ్,సర్పంచులు కోరం సుభాష్ చంద్ర బోస్, కోరం హనుమంతు,తదితర నాయకులు పాల్గొన్నారు.